
నాడు సంక్షేమం.. నేడు వంచన!

సూపర్ 6



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లూ ప్రతినెలా ఏదో ఒక పథకం కింద సంక్షేమ ఫలాలు దక్కడంతో సంతోషంగా జీవించిన పేదలకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం షాక్‌ల మీద షాకులిస్తోంది. సంపంద సృష్టించాకే .. సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులెత్తేయడంపై అన్ని వర్గాల ప్రజలు మండిపడుతున్నారు.

- సూపర్ సిక్స్ హామీల అమలును అటకెక్కించిన కూటమి ప్రభుత్వం
- సంపద సృష్టించాకే అమలు చేస్తామన్న సీఎం వ్యాఖ్యలపై ప్రజల ఆగ్రహం
- నమ్మించి మోసం చేశారని ఆవేదన

రాయదుర్గం: సూపర్ సిక్స్ హామీల అమలుకు కూటమి సర్కార్ మంగళం పాడింది. అధికారం చేపట్టి ఎనిమిది నెలలు కావస్తోన్నా ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏ గ్రామానికెళ్లినా.. ఏ ఇంట్లో పలకరించినా.. ఏ నలుగురు కలిసినా సూపర్ సిక్స్ హామీల అమలుపైనే చర్చ సాగుతుంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉండివుంటే కష్టాలెన్ని వచ్చినా ఎదుర్కొంటూ నెలకో సంక్షేమ పథకం కింద బ్యాంకు ఖాతాలకే నేరుగా డబ్బులు అందేవని మాట్లాడుకుంటున్నారు. అయితే కూటమి ప్రభుత్వ హయాంలో కొత్తహామీలు దేవుడెరుగు.. ఉండే పథకాల్లోనూ ఏవేవో కారణాలు చూపిస్తూ భారీగా కోత వేస్తుండటంతో లబ్ధిదారులు బెంబేలెత్తుతున్నారు. ఓ వైపు దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తుల పింఛన్ల తొలగింపుకు జాబితా సిద్ధం చేస్తున్నారు. మరోవైపు సాధారణ పింఛన్ దారులకు సైతం నోటీసులు ఇస్తున్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు అని అని ప్రకటించినా... చాలా మంది అర్హులకు నేటికీ గ్యాస్ సిలెండర్ డబ్బులు కూడా ఇవ్వలేని పరిస్థితి. తల్లికి వందనానికి పంగనామాలు పెట్టారు. నేతన్ననేస్తం కనుమరుగైంది. అన్నదాత సుఖీభవ అటకెక్కింది. ఉచిత పంటల బీమా ఊసేలేదు. వసతి దీవెన, విద్యా దీవెన, తోడు, సున్నావడ్డీ, వాహనమిత్ర, కాపు నేస్తం లాంటి పథకాలు కనుమరుగైపోయాయి. మహిళలకు ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి ఇప్పట్లో లేనట్టేనని సర్కార్ తేల్చేసింది. దీంతో పేదలు కూటమి ప్రభుత్వంపై రగిలిపోతున్నారు.

రూ.1,327 కోట్ల లబ్ధి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు ఆర్థిక కష్టాలు మొదలయ్యాయి. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టి ఎనిమిది నెలలు కావస్తున్నా ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీ (సూపర్ సిక్స్) పథకాల అమలులో మాత్రం అంగుళం కూడా కదలేకపోయాయి. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో 2023–24 మార్చి వరకూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమ్మఒడి, ఆసరా, చేయూత, రైతు భరోసా, తోడు, చేదోడు, నేతన్ననేస్తం, కాపు నేస్తం, విద్యాదీవెన, వసతిదీవెన లాంటి వివిధ సంక్షేమ పథకాల కోసం రూ.1,327 కోట్లు ఖర్చుచేసింది. ఈ మొత్తం 10,50,509 మంది లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది. ప్రస్తుత కూటమి సర్కార్ ఒక్క పథకాన్ని సక్రమంగా అమలుచేయకపోగా, సంపద సృష్టించాకే సూపర్ హామీలంటూ సీఎం చంద్రబాబు మరో పిడుగులాంటి వార్త జనం నెత్తిన వేశారు. ఈ నేపథ్యంలో అన్ని వర్గాల ప్రజల నుంచి ప్రభుత్వంపై ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి.

హామీలు అమలు చేయాలి



ముఖ్యమంత్రి చంద్రబాబు సంపద సృష్టించాకనే సూపర్ సిక్స్‌ను అమలు చేస్తామనడం సరికాదు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అందించాలి. ఆరు గ్యారెంటీల హామీలను నమ్మి ప్రజలు ఓట్లేశారు. లోటు బడ్జెట్ పేరుతో వంచన చేయడం సరికాదు. ఉచిత బస్సు కోసం మహిళలు ఎదురు చూస్తున్నారు.

– ఉషారాణి, రాయదుర్గం

పేదలకు న్యాయం చేయాలి



సూపర్‌సిక్స్ హామీలు అమలు చేసి పేదలకు న్యాయం చేయాలి. గత వైఎస్సార్‌సీపీ హయంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించి మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి న్యాయం చేశారు. ప్రస్తుత కూటమి సర్కార్ ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ఉచిత గ్యాస్ పథకాన్ని కూడా అటకెక్కించారు.అన్నదాత సుఖీభవ లేదు, తల్లికి వందనం లేదు. లోటు బడ్జెట్ పేరుతో కాలయాపన చేయడం సరైంది కాదు.

– మేకల శ్రీనివాసులు, రాయదుర్గం

క్లుప్తంగా

డ్రైవింగ్‌లో అప్రమత్తత అవసరం



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ విశ్వనాథరెడ్డి

రాయదుర్గంటౌన్: డ్రైవింగ్ సమయంలో డ్రైవర్లు నిర్లక్ష్యం వహించకుండా ఏకాగ్రత, అప్రమత్తతతో వ్యవహరిస్తే ప్రమాదాలను నివారించవచ్చని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా బుధవారం స్థానిక ఎంవీఐ కార్యాలయంలో స్కూల్ బస్సు డ్రైవర్లు, వారి సహాయకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంవీఐ మాట్లాడుతూ కేవలం నిర్లక్ష్యం మూలంగానే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇటీవల జరిగిన స్కూల్ బస్సు ప్రమాదం డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా జరిగిందన్నారు.

చిరుత దాడిలో ఆవు మృతి



మృతి చెందిన ఆవు

కళ్యాణదుర్గం రూరల్: చిరుత దాడిలో ఆవు మృతి చెందిన ఘటన చాపిరిలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన రైతు హరికృష్ణ తన తోటలో ఆవును కట్టేశాడు. అర్ధరాత్రి సమయంలో చిరుత ఆవుపై ఒక్కసారిగా దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. రూ.60 వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

డైమండ్ జూబ్లీ ఉత్సవాలకు 'అనంత' విద్యార్థులు



ఉత్సవాలకు వెళ్తున్న విద్యార్థులు

కుందుర్పి: తమిళనాడులోని తిరుచనాపల్లిలో జరుగుతున్న డైమండ్ జూబ్లీ జంబూరీ ఉత్సవాలకు జిల్లాకు చెందిన 13 మంది స్కౌట్స్, 19 మంది గైడ్స్ విద్యార్థులు మంగళవారం రాత్రి బయలుదేరారు. ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 3 వరకు ఉత్సవాలు జరుగుతాయని స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి బొమ్మయ్య తెలిపారు. అక్కడ విద్యార్థులకు ఫోక్‌డ్యాన్స్, ఫుడ్ ఫెస్టివల్, రంగోలి, మార్చ్ ఫాస్ట్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, ఎగ్జిబిషన్ తదితర పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. విద్యార్థుల వెంట బొమ్మయ్యతో పాటు ఉపాధ్యాయినులు శైలజ, కమలాక్షి, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

చురుగ్గా 'రాష్ట్రీయ బాల ఆరోగ్య సర్వే'



చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యాధికారి

కూడేరు: రాష్ట్రీయ బాల ఆరోగ్య (ఆర్‌బీఎస్‌కే) కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లోని పిల్లల ఆరోగ్య స్థితిగతులపై సర్వే ముమ్మరంగా సాగుతోంది. ఇప్పటికే మండలంలోని 38 అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ, సిబ్బందితో కలిసి స్క్రీనింగ్ టెస్టులు చేశారు. పాఠశాలల్లోని పిల్లలకు 50 శాతం మంది పిల్లలకు స్క్రీనింగ్ టెస్టు పూర్తి అయింది. బుధవారం కరుట్లపల్లిలోని పాఠశాలలో స్క్రీనింగ్ టెస్టు చేశారు.

నేమకల్లు ఆలయ అభివృద్ధికి రూ.3.7 కోట్లు మంజూరు

బొమ్మనహాళ్: నేమకల్లు ఆంజినేయస్వామి ఆలయ అభివృద్ధికి రూ.3.7 కోట్లు మంజూరు చేస్తూ పాలనా అనుమతులు జారీ చేయగా దేవదాయశాఖకు ఉత్వర్తులు వెలువడ్డాయని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆలయ గోపురం ఇతరత్రా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. త్వరితగతిన పనులు ప్రారంభించేలా సంబంధిత అధికారులను చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



గోవిందరెడ్డి (ఫైల్)

డీ.హీరేహాళ్ (బొమ్మనహాళ్): డీ.హీరేహాళ్ మండల కేంద్రంలోని బళ్లారి–బెంగళూరు హైవేలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన గోవిందరెడ్డి (50) మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన గోవిందరెడ్డి అనే వ్యక్తి పంచర్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తుండేవాడు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో పని నిమిత్తం గ్రామం నుంచి ద్విచక్ర వాహనంలో రాంపురం వైపు వెళుతుండగా జాజరకల్లు సమీపంలో నేషనల్ హైవేలో ముందు వెళ్తున్న బొలెరో వాహనాన్ని వెనుక నుంచి ఢీ కొన్నాడు. బళ్లారికి తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గోవిందరెడ్డి చనిపోయాడు. మృతుడు భార్య పార్వతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

నాగప్ప స్వామి చల్లగా చూడు..



చెట్టు పక్కకు వెళుతున్న నాగుపాము

కూడేరు: కొర్రకోడు–చోళసముద్రం గ్రామాల మధ్య పురాతనమైన గుండు నాగప్ప స్వామి (పెద్ద గుండకు ఏర్పాటు చేసిన నాగు ప్రతిమలు) ప్రతిమల వద్ద బుధవారం నాగుపాము ప్రత్యక్షమైంది. ఈ నాగ ప్రతిమలను దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయన్నది ప్రజల నమ్మకం. ఇంతటి మహిమ నాగప్ప స్వామి సంప్రోక్షణ, నాగ ప్రతిష్టల కార్యక్రమాన్ని ఫిబ్రవరి 1, 2 తేదీల్లో చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం పెద్ద నాగుపాము ప్రత్యక్షమైంది. నాగుపామును చూసిన కొందరు గ్రామస్తులకు తెలియజేశారు. ఆ రెండు గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. నాగుపాము కొన్ని గంటల పాటు అక్కడే ఉండిపోయింది. ప్రజలు నాగప్ప స్వామే ప్రత్యక్షమయ్యాడని చర్చించుకున్నారు. నాగప్ప స్వామి రెండు గ్రామాలు చల్లగా ఉండేలా చూడు అని వేడుకున్నారు. అనంతరం పాము చెట్టు పక్కకు వెళ్లి కనిపించకుండా పోయింది.

సీఎల్ఎస్ యాప్‌ను సద్వినియోగం చేసుకోండి



75 వీరాపురంలో పొలం పిలుస్తోందిలో పాల్గొన్న డీడీఏ మద్దిలేటి

గుమ్మఘట్ట: వివిధ రకాల పంటలను సాగు చేస్తున్న అన్నదాతలు సీఎల్ఎస్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని డీడీఏ మద్దిలేటి అన్నారు. మండలంలోని 75 వీరాపురం గ్రామ సమీపంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతులు సాగు చేసిన పంటలకు సోకిన తెగులు, పురుగుల ఫోటోలు తీసి యాప్‌లో పొందుపరిస్తే దానికి సంబంధించిన సమాచారాన్ని పూర్తి వివరాలతో వ్యవసాయశాఖ అధికారులు అందిస్తారని తెలిపారు. ఏఓ నిర్మల్ కుమార్, సర్పంచ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భంభంస్వామి దర్గాలో పూజలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని భంభంస్వామి ఆశ్రమ దర్గాలో భంషేక్ అబ్దుల్ స్వామి జీవసమాధిని భక్తులు బుధవారం పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. మౌని అమావాస్య కావడంతో విశేష పూజలతో పాటు ప్రత్యేక ఫాతెహా జరిపించారు.

'హంద్రీ–నీవాను కొల్లగొడుతున్నారు'



హంద్రీ-నీవా కాలువ నుంచి అక్రమంగా మట్టిని తరలించిన దృశ్యం

- జేసీబీలతో అక్రమ వెంచర్లకు మట్టి తరలిస్తున్న టీడీపీ నాయకులు
- చోద్యం చూస్తున్న అధికారులు

ఉరవకొండ: హంద్రీ–నీవా కాలువ మట్టిని టీడీపీ నేతలు విచ్చలవిడిగా తరలిస్తున్నారు. అక్రమ, అనధికారిక వెంచర్లను చదును చేసేందుకు ఈ మట్టిని యథేచ్ఛగా తోలుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మండల పరిధిలోని చిన్నముష్టూరు, ఇంద్రావతి గ్రామాల వద్ద ఉన్న హంద్రీ–నీవా ప్రధాన కాలువ నుంచి నిత్యం పెద్ద ఎత్తున ట్రాక్టర్లలతో మట్టిని వెంచర్లతో పాటు ఇతర కట్టడాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. 42వ జాతీయ రహదారి వెంబడి వందలాది ట్రాక్టర్ల మట్టి తరలిస్తున్న అధికారులు చోద్యం చూస్తున్నారు. మట్టిని అక్రమ రవాణా చేస్తుండటంతో కాలువ గట్టు బలహీన పడి ఇప్పటికే చాల చోట్ల కోతకు గురవుతోంది.

రియల్ దందా..

ఉరవకొండ–అనంతపురం 42వ జాతీయ రహదారి వద్ద ఇంద్రావతి రోడ్డు వైపు సర్వే నంబర్ 90లో ఉరవకొండ పట్టణానికి చెందిన కొంతమంది టీడీపీ నాయకులు కలిసి రియల్ దందా కొనసాగిస్తున్నారు. నిత్యం పచ్చని పొలాలతో కళకళ లాడే నల్లరేగటి భూములను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. అందులో హంద్రీ–నీవా మట్టిని వేసి చదును చేసి ప్లాట్లు వేసి అమ్ముకునేందుకు సిద్ధం అయ్యారు. ఉరవకొండ చుట్టూ దాదాపు 20 నుంచి 30 వరకూ అనధికారిక వెంచర్లు వెలిశాయి. వీటన్నింటికీ వందలాది ట్రాక్టర్లతో ఇప్పటికే హంద్రీ నీవా మట్టిని తరలించారు. అక్రమంగా మట్టి తరలింపుపై నీటి పారుదల, రెవెన్యూ శాఖల అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కళ్ల ముందే ఇంత పెద్ద ఎత్తున దోపిడి జరుగుతున్నా అధికారులు పట్టించుకోక పోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తం మవుతున్నాయి.

'తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వద్దు'



కందుల కొనుగోలు కేంద్రాలపై ఏఓను ప్రశ్నిస్తున్న ఎంపీపీ నరసింహులు

ఉరవకొండ: 'పట్టణంలో తాగునీరు కలుషితం అవుతోంది. ట్యాంకులు శుభ్రం చేయమంటే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. 10 రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా చేస్తే ప్రజలకు మేం ఏం సమాధానం చెప్పాలి' అని ఎంపీపీ నరసింహులు, ఉరవకొండ మేజర్ పంచాయతీ సర్పంచ్ మీనుగ లలితమ్మ, ఎంపీటీసీ వన్నూర్‌సాబ్ తదితరులు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ విజయ్యను నిలదీశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ లలితమ్మ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులంటే మీకు చులనకగా ఉందా అని అధికారులను నిలదీశారు. తాగునీటి సమస్యపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజలతో కలిసి ఆందోళన చేపడుతామన్నారు. అనంతరం నెరిమెట్ల సర్పంచ్ యోగేంద్రరెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో పైప్‌లైన్లకు మరమ్మతులు చేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. నిధులు మంజూరు చేయకపోతే పంచాయతీ నిధులను వినియోగిస్తామన్నారు. కందుల కొనుగోలు కేంద్రాలు కేవలం తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారని ఎంపీపీ నరసింహులు అన్నారు. రైతులకు సవాలక్ష నిబంధనలు పెడితే గత్యంతరం లేక బయట అమ్ముకుంటున్నారని ఏఓ శుభకర్‌ను మోపిడి సర్పంచ్ సిద్దూ నిలదీశారు.

నిబంధనలు పాటించాలి



స్కూల్ బస్సుల రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌ఐ నబీరసూల్

బొమ్మనహాళ్: రహదారి భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించడం సాధ్యమవుతుందని బొమ్మనహాళ్ ఎస్‌ఐ నబీ రసూల్ తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన బొమ్మనహాళ్‌లోని ప్రతిభ, మేధా ఇంగ్లిష్ మీడియం స్కూళ్లలోని బస్సుల డ్రైవర్లు, బస్సుల ఫిట్నెస్, బస్సులకు సంబంధించిన ఆర్‌సీ, డ్రైవర్స్‌కు డ్రైవింగ్ లైసెన్సు తదితర డాక్యుమెంట్లను పరిశీలించారు. విద్యార్థులను బస్సులో ఎక్కించుకునేటప్పుడు, దింపే సమయాల్లో జాగ్రత్తలు పాటించాలన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక మారంపల్లి కాలనీలో ఉన్న ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లో 23 మంది టెన్త్ విద్యార్థులకు బుధవారం మెడికల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ, అనంతపురం ఆర్ఎంఓ డాక్టర్ గుజ్జల హేమలత ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మోహన్, ప్రిన్సిపాల్ నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

కళ్యాణదుర్గం రూరల్: బోరంపల్లి గ్రామానికి చెందిన హరిజన అంజప్ప అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. వైఎస్సార్‌సీపీ నేత, సర్పంచ్ భర్త సోమశేఖర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది అంజప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళులఅర్పించారు. అనంతరం మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కృష్ణరెడ్డి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పశు ఆరోగ్యశిబిరం

బ్రహ్మసముద్రం : నంజాపురం, బుడిమేపల్లిలో బుధవారం పశుఆరోగ్య శిబిరం నిర్వహించారు. నంజాపురంలో 112, బుడిమేపల్లిలో 225 పశువులకు టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి నవీన్ కుమార్ తెలిపారు. పశువైద్య సిబ్బంది ప్రియాంక, భానుప్రియ తదితరులు పాల్గొన్నారు.

కొంపముంచిన నాసిరకం ఆర్గానిక్ మందులు



వ్యాసాపురంలో నాసిరకం ఆర్గానిక్ మందులు వాడటంతో దెబ్బతిన్న మిర్చి పంట

ఉరవకొండ: నాసిరకం ఆర్గానిక్ మందులు కొంపముంచాయి. ఈ మందులు పిచికారీ చేయడంతో 15 ఎకరాల్లో సాగు చేసిన మిర్చి పంటను కోల్పోయామని రైతులు బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. వివరాలు.. మండల పరిధిలోని వ్యాసాపురం గ్రామానికి చెందిన మనోహర్, ఎల్లప్ప, నాగరాజు తదితరులు గత ఏడాది ఆగస్టులో 15 ఎకరాల్లో తేజ రకం మిర్చి సాగు చేశారు. ఎకరానికి రూ.లక్ష చొప్పున పెట్టుబడి పెట్టారు. ఉరవకొండ పట్టణానికి చెందిన శ్రీకళా ఆగ్రో ఏజెన్సీ వారు తమ వద్ద ఆర్గానిక్ మందులు అందుబాటులో ఉన్నాయని రైతులకు సూచించారు. వీటిని వాడితే ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని తెలిపారు. దిగుబడి పెరుగుతుందనే ఆశతో రైతులు ఆర్గానిక్ మందులు వాడారు. అయితే పంట మొత్తం కుళ్లిపోవడంతో లబోదిబోమంటున్నారు. రూ.లక్షల పెట్టుబడులు పెట్టి నాసిరకం మందులు పిచకారీ చేయడం వల్ల మోసపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

కుందుర్పి: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ఫిబ్రవరి 5 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త సత్యనారాయణశాస్త్రి, సర్పంచ్ మారుతేశ్వరీ తదితరులు తెలిపారు. తొలిరోజు శ్రీవారికి అభిషేకం, అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. వచ్చే నెల 3న రథోత్సవం జరుగుతాయని, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఆయాలతో గొడ్డు చాకిరీ తగదు

రాయదుర్గంటౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో పని చేస్తున్న ఆయాలపై తీవ్రమైన పనిభారం మోపుతున్నారని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆయాల సంఖ్య పెంచాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ నాయకులు బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, అధ్యాపకులతో సమావేశమై ఆయాల సమస్యలపై చర్చించారు. కేవలం మరుగుదొడ్లు శుభ్రపరిచే పని చేయడం ఆయాల పని అని, అయితే ఇతర పనులు కూడా చేయించుకోవడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రాము, వంశీకృష్ణ తదతరులు పాల్గొన్నారు.

గర్భకోశ వ్యాధులపై అవగాహన

కూడేరు: గర్భకోశ వ్యాధులపై పశుపెంపకందారులు జాగ్రతలు తీసుకోవాలని మండల పశు వైద్యాధికారి శ్రీనివాసులు సూచించారు. బుధవారం మండల పరిధిలోని కలగళ్లలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. కృత్రిమ గర్భధారణ, గర్భకోశ వ్యాధులు, నట్టల నివారణ, పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపునకు వేయించాల్సిన టీకాలపై అవగాహన కల్పించారు. అనంతరం పశువులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఏ భాగ్యలక్ష్మి , ఏహెచ్ఏలు యశోద, రఘువర్దన్, రామాంజనేయులు, భవాని, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ మదన్‌మోహన్‌కు గుండెపోటు

కంబదూరు: మండల విద్యాశాఖాధికారి–2 మదన్‌మోహన్ గుండె పోటుకు గురయ్యారు. మంగళవారం

సంక్షిప్త సమాచారం

రాత్రి ఇంటిలో ఉండగా ఉన్న ఫలంగా గుండెపోటు వచ్చింది. వెంటనే కుటుంబ సభ్యులు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి స్టంట్ వేశారు. ప్రస్తుతం ఎంఈఓ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. విషయం తెలుసుకున్న జిల్లా విద్యాశాఖాధికారి ప్రసాద్‌బాబు బుధవారం ఆస్పత్రికి వెళ్లి ఎంఈఓను పరామర్శించారు. ఎంఈఓ మదన్‌మోహన్ భార్య విజయకుమారి కళ్యాణదుర్గం ఎంఈఓగా పని చేస్తోంది.

కుక్కల దాడిలో గొర్రెల మృతి

కళ్యాణదుర్గం రూరల్: గొర్రెల మందపై కుక్కల దాడి చేసిన ఘటనలో గొర్రెపిల్లలు మృతి చెందాయి. కామక్కపల్లిలోని వ్యవసాయతోటలో రైతు బోయ శివన్నకు చెందిన గొర్రెల మందపై బుధవారం కుక్కలు దాడి చేశాయి. దాడిలో 20 గొర్రెలు పిల్లలు మృతి చెందాయి. సుమారు రూ.60 వేలు నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు.

సమయపాలన తప్పనిసరి

వజ్రకరూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో సమయపాలన తప్పక పాటించాలని ఐసీడీఎస్ ఉరవకొండ ప్రాజెక్టు సీడీపీఓ శ్రీదేవి సూచించారు. బుధవారం మండల కేంద్రంలో మూడు సెక్టార్ల (వజ్రకరూరు, గడేహోతురు, రాగులపాడు) అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ యల్లమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ వితరణ

వజ్రకరూరు: చిన్నహోతురులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం ఎస్టీయూ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, పీఈటీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను క్రమబద్ధీకరించాలి

శెట్టూరు: అంగన్‌వాడీ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ద్వారా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు దరఖాస్తులు పంపించారు. ఈసందర్భంగా యూనియన్ నేతలు మాట్లాడుతూ తమను గ్రేడ్ –3, గ్రేడ్–4 ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అలాగే కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. యూనియన్ జిల్లా నేత శకుంతలమ్మ, మండల నేతలు అపర్ణ, విమల, విశాలక్షి, ద్రాక్షాయణి, కుముద, సరస్వతి ఉన్నారు.

వామి దగ్ధం

బ్రహ్మసముద్రం : భైరసముద్రంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని వామి దగ్ధమైంది. వివరాలు..గ్రామానికి చెందిన సూరయ్యగారి ఎర్రిస్వామి తన కల్లం దొడ్డిలో మూడు ట్రాక్టర్ల వేరుశనగ పొట్టును వామిగా వేసుకున్నాడు. బుధవారం ఉదయం వామి నుంచి మంటలు ఎగిసిపడ్డాయి. గమనించిన స్థానికులు మంటలు ఆర్పేందుకు యత్నించారు. అయితే అప్పటికే వామి పూర్తిగా కాలిపోయింది. ఘటనలో రూ.50 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

చట్టాలపై అవగాహన అవసరం

వజ్రకరూరు: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని న్యాయవాదులు లీలావతి, జహరాబీ తదితరులు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని జనార్ధన వేంకటేశ్వరస్వామి దేవాలయం పక్కన ఉన్న మినీ కళ్యాణ మండపంలో మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

త్వరలో కందుల కొనుగోలు కేంద్రం

కణేకల్లు: త్వరలోనే మండల కేంద్రంలో కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు ఏఓ ఏ.శ్రవణ్ కుమార్ తెలిపారు. కనీస మద్దతు ధర క్వింటాల్ రూ.7,550తో కొనుగోలు చేస్తామన్నారు.

మౌని అమావాస్య పూజలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలోని జంబుకేశ్వర స్వామి ఆలయంలో మౌని అమావాస్యను పురస్కరించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రామకృష్ణ స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మంగళ నైవేద్యాలు చేశారు.

కణేకల్లు: మండల ప్రజల ఆరాధ్యదైవమైన చిక్కణ్ణేశ్వరుడికి బుధవారం అమావాస్య పూజలు నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాభిషేకం , మహామంగళారతి, రుద్రాభిషేకం, ఆకుపూజలు చేశారు.

రైల్వే బ్రిడ్జి కింద రోడ్డు మరమ్మతు పనులు



అండర్ రైల్వే బ్రిడ్జి కింద మరమ్మతు పనులు చేస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: బైపాస్‌లోని అండర్ రైల్వే బ్రిడ్జి కింద రోడ్డు ధ్వంసమై వాహన రాకపోకలు తీవ్ర ఇబ్బందులు తలెత్తేవి. వర్షాకాలంలో వాహనాలు ఇరుక్కుపోయేవి. ఊట నీటితో మరింత అధ్వానంగా మారింది. ఎట్టకేలకు స్పందించిన రైల్వే అధికారులు రోడ్డు మరమ్మతుకు చర్యలు చేపట్టారు. బుధవారం నుంచి పనులకు శ్రీకారం చుట్టారు. అయితే ఇంజనీరింగ్ అధికారులు ఎవరూ లేకపోవడంతో పనుల నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. ధ్వంసమైన రోడ్డు మరమ్మతులను ఇప్పటికే రెండుసార్లు చేపట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. ప్రత్యేక ప్రణాళికతో వర్షపునీరు, డ్రైనేజీ నీరు వెళ్లేందుకు ప్రత్యేక ప్రణాళిక శాశ్వత పరిష్కారం దిశగా పనులు చేయాల్సి ఉన్నా అధికారులు కేవలం మరమ్మతులతో చేతులు దులుపుకుంటున్నట్లు స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేశారు.